క్లుప్తంగా

ఘనంగా మారెమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం టౌన్: మండల పరిధిలోని తూమకుంటలో వెలసిన మారెమ్మదేవి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన గ్రామ దేవతకు గ్రామస్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలను చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, నాయకులు తిప్పేరుద్రయ్య, ధనుంజయరెడ్డి, మహేష్‌గౌడ్, దేవరాజు, రామాంజి, అయోగ్ బాషా, బాలు, మణేసముద్రం గిరి, శ్రీరాములు, శబరీష్‌రెడ్డి, అయోబ్ బేగ్, ఆసీఫ్, సహేరాబాను తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీకి గాయాలు

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీ నగర్ గ్రామం వద్ద ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా బూచెర్ల గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ఆంజినేయులుకు విద్యుదాఘానికి గురయ్యాడు. బుధవారం ఉదయం నిర్మాణం పనులు చేస్తుండగా పక్కనున్న 11కేవీ విద్యుత్ లైన్ తగలడంతో సంఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును వెంటనే పెనుకొండ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు పేర్కొన్నారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న డీపీఎమ్ రామ్మోహన్

గుడిబండ: సమీకృత వ్యవసాయ విధానం ద్వారా పంటలను పండించడం, అనేక రకాల జంతువులను పెంచడంతో ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని డీపీఎమ్ రామ్మోహన్ తెలిపారు. మండల పరిధిలోని కరికెరలో బుధవారం ఎస్ఐఆర్‌పీ, వెలుగు ప్రాజెక్ట్ వివిధ శాఖల ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎం రమణప్ప, ఏటీ వీరనరేష్, ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కంది పంటకు నిప్పు



కాలిపోతున్న కందిపంట

లేపాక్షి: మండంలోని చోళసముద్రం గ్రామం జాతీయ రహదారి పక్కన ఉన్న రైతు నరసింహమూర్తికి చెందిన కందిపంట అగ్నికి ఆహుతైంది. బుధవారం సాయంత్రం జాతీయ రహదారిలో వెళుతున్న వ్యక్తులు సిగరెట్ తాగి వేయడంతో 1.30 ఎకరాల కంది పంటకు నిప్పు అంటుకుని పూర్తిగా కాలి పోయిందని బాధిత రైతు వాపోయారు. దీంతో తనకు రూ. 50 వేల వరకూ నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

గుడిబండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పంచాయత్ కార్యదర్శి సహకారంతో ఆవరణలో ఉన్న గడ్డి, అవసరం లేని మొక్కలను తొలగించాలని సూచించారు. అనంతరం ల్యాబ్, వార్డు, ఫార్మసీ తదితర గదులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యాధికారిణి సౌందర్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గోదాములో ఎగిసిపడుతున్న మంటలు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో బుధవారం రాత్రి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీదేవి టెక్స్‌టైల్స్ ఇంటి వెనుక ఉన్న గోదాములో అగ్ని ప్రమాదం జరిగింది. గోదాములో చెత్త పేపర్లు, కవర్లు, చీరల కవర్లు, కట్టెలు అగ్గిపాలైనట్లు బాధితుడు శక్తి ప్రసాద్ తెలిపారు. మడకశిరలో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

ఇంత నిర్లక్ష్యమా..?

- నాలుగు రోజులుగా అన్నదాతల నిరసనలు
- సక్రమంగా విద్యుత్ ఇవ్వాలని మొర
- పట్టించుకోని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అధికారులు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



లో ఓల్టేజీ సమస్యతో రైతు దేవరాజుకు చెందిన విద్యుత్ స్టార్టర్ కాలిపోయిన దృశ్యం

రొళ్ల/అమరాపురం: మడకశిర నియోజకవర్గంలోని పలు మండలాల్లో లోఓల్టేజీ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగానే రొళ్ల మండలంలో గత నాలుగు రోజులుగా అన్నదాతలు రోడ్డెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. అలాగే అగళి, అమరాపురం మండలాల్లోని రైతులు కూడా తమ సమస్యలను పరిష్కరించాలని గళమెత్తుతున్నారు. అన్నదాతల నిరసనలు కొనసాగుతున్నా ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో పాటు విద్యుత్‌శాఖ అధికారులు కూడా ఏమాత్రం స్పందించడం లేదు. అన్నం పెట్టే అన్నదాతలకు సమస్య వచ్చినా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మడకశిరలో సర్వీసులు, సబ్‌స్టేషన్లు ఇలా..

మండలం	వ్యవసాయ విద్యుత్ సర్వీసుల సంఖ్య	విద్యుత్ సబ్‌స్టేషన్ల సంఖ్య
రొళ్ల	3,812	3
అగళి	3,600	4
గుడిబండ	3,100	3
అమరాపురం	3,800	5
మడకశిర	3,400	4



రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

17,912 విద్యుత్ సబ్‌స్టేషన్లు

నియోజకవర్గం వ్యాప్తంగా 19 విద్యుత్ సబ్‌స్టేషన్లు, 17,912 వ్యవసాయ విద్యుత్ సర్వీలు ఉన్నాయి. రొళ్ల మండలంలో బోరు బావుల కింద నీటి వసతి కలిగిన రైతులు వేరుశనగ, మిరప, రాగి, వరి, మొక్కజొన్న, గుమ్మడికాయ, దోసకాయల సాగుతో పాటు దానిమ్మ, బొప్పాయ, అరటి వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. పంటలు ఆశాజనకంగా ఉన్న కూడా త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా ఇవ్వకపోవడంతో సాగు చేసిన పంటకు నీళ్ల లేక ఎండుముఖం పడుతున్నాయి. దీంతో న్యాయం చేయాలంటూ అన్నదాతలు విద్యుత్‌సబ్‌స్టేషన్ ముందు నిరసనలకు దిగారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

అధిక లోడ్‌తో ఇబ్బందులు

అమరాపురం మండల పరిధిలోని హేమావతి, కె.శివరం పంచాయతీలోని బోరు బావులు వున్న రైతులకు లో ఓల్టేజి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హేమావతి, బసవనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మూడు వేల మంది రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ, పత్తి, జొన్న తదితర పంటలను సాగు చేశారు. అయితే అధిక వర్షాలు కారణంగా పంట నష్టం జరిగింది. ప్రస్తుతం మూడు వేల మంది దాకా రైతులు తమ బోరు బావుల కింద రబీలో వేరుశనగ, పత్తి, మిరప, రాగి, మిడిసిన్ సొతే, దీర్ఘ కాలిక పంట వక్క తోటలను సాగు చేశారు. అయితే కె.శివరం, పి.శివరం, మద్య శివరం, రంగాపురం, కరేకల్లహట్టి, పేలుబండ, గ్రామాలు బసవనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోనికి వస్తాయి. హేమావతి సబ్‌స్టేషన్ పరిధిలో హేమావతి, గుణేహళ్లి, కెంకెర, కాచికుంట, ఉదుగూరు, ఉప్పరహట్టి, గొల్లమారనహళ్లి, తంబాళహట్టి గ్రామాలు వస్తాయి. దీంతో రైతులు అధికంగా పంటలు వేసుకోవడంతో విద్యుత్‌లో అంతరాయం కలుగుతోంది. అధిక లోడ్‌తో విద్యుత్ ట్రాన్స్‌ఫార్లు దెబ్బతింటున్నాయి.

స్పందించని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

విద్యుత్ సమస్యలపై రొళ్ల, అగళి, అమరాపురం రైతులు ఆందోళనకు దిగినా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాత్రం స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్ద పీట వేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



రబీలో వేసిన పంటలు ఎండిపోకుండా నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు సరాఫరా చేయాలి. ప్రస్తుతం పత్తి పంటను సాగు చేశా. పంట బాగుంది. అయితే నిరంతరం కరెంటు కోత ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులను అడిగితే ఓవర్‌లోడు అంటున్నారు. సమస్యను పరిష్కరించాలి.

– శివకుమార్, కరేకల్లహట్టి, అమరాపురం మండలం

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి



నాకున్న రెండున్నర ఎకరాల్లో బోరు బావుల కింద రాగి, మెడిసిన్ సొతే పత్తి పంటలను సాగు చేశా. అయితే అధిక లోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. నెలలో కరెంటు సమస్యతో రెండు సార్లు కాలిపోయాయి. దీంతో పది వేలు ఖర్చు వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి కె.శివరం సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తే మనకు విద్యుత్ సమస్య ఉండదు.

– గంగాధర, కెంకెర గ్రామం, అమరాపురం మండలం

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



విద్యుత్ లోఓల్టేజీ సమస్య వల్ల పంటలు ఎండుతున్నాయి. రెండు ఎకరాల్లో గుమ్మడి కాయలు, అర ఎకరంలో దోసకాయల పంటను సాగు చేశాను. వారం రోజులుగా రోజూ రెండు గంటలు కూడా త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా కావడం లేదు. లోఓల్టేజీ సమస్యతో ఈ రోజు బోరుబావికి అమర్చిన విద్యుత్ స్టార్టర్ కూడా ఖాళీ పోయింది. సుమారు రూ. 15 వేలు నష్టం జరిగింది. రొళ్ల సబ్ స్టేషన్ వద్ద లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ధర్నా చేసినా ఎవరూ పట్టించుకోలేదు. – **దేవరాజు, హెచ్‌ఎం పల్లి, రొళ్ల మండలం**

రైతు సమస్యలు పట్టవా?



అధికారంలోకి వచ్చిన వెంటనే పగటి సమయంలోనే రోజుకు తొమ్మిది గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను వ్యవసాయ రంగానికి అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం వేసవి ప్రారంభం కాకనే రోజూ రెండు గంటలు కూడా త్రీ ఫేస్ విద్యుత్ ఇవ్వడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూడా స్థానిక రైతుల సమస్యలు పట్టించుకోకపోవడం బాధాకరం. – **ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర**

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రొళ్ల: నీటి వసతి కలిగి ఉండి పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడితో పాటు లాభాలు కూడా పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం రొళ్ల మండలంలోని వన్నారనపల్లిలో రైతు నారాయణప్ప సాగు చేసిన అరటి, మామిడి ఇతరాత్ర పంటలను ఆయన పరిశీలించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో సుమారు 2,675 హెక్టర్లలో వక్క తోట, 1,800 హెక్టర్లలో మామిడి తోట ఉందన్నారు. కొత్తగా వక్క చెట్లు నాటే రైతులు నాణ్యమైన రోగరహిత మొక్కలను ఎంచుకుని ఎటు చూసిన 10 అడుగుల పొడవు, వెడల్పు ప్రకారం నాటుకోవాలన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, అందువల్ల చెట్ల మధ్యలో అవిశ మొక్కలు నాటుకోవాలన్నారు. వక్క సాగుతో పాటు మామిడి, దానిమ్మ, బొప్పాయ ఇతరాత్ర వాణిజ్య పంట సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వేసుకొంటే అధిక దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అసిస్టెంట్ కిరణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కెంచమాంబదేవి జాతర

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరులో వెలసిన కుంచిటి వక్కలిగలోని సోమేనహళ్లి గోత్రానికి చెందిన కుల దేవత కెంచమాంబదేవి అమ్మవారి పెద్ద జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30న గురువారం నూతనంగా నిర్మించిన ఆలయ ప్రవేశం, వివిధ హోమాలు, 31న అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, 1న ఆంజనేయస్వామి, తిమ్మప్పస్వామి విగ్రహాల ప్రాణ ప్రతిష్టాపన, 2న ఆదివారం జానకల్లు గుడికట్టు చేరిన అన్నదమ్ములు మీసలు బియ్యం, బేడలు, బెల్లం, బండి అలంకరణ, 3న అమ్మవారి జలధి ఉత్సవం, 4న వీరలింగప్ప స్వామి, గణేష దేవునికి పూజలు ఉత్సవ విగ్రహంతో వెళ్లుట, తలనీలాలు, 5న బుధవారం హోళి ఉత్సవం, 101 ఎడలు వేసే కార్యక్రమం ఉంటుందన్నారు.

పీహెచ్‌సీల పరిశీలన

గోరంట్ల: మండల పరిధిలోని కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గోరంట్లలోని కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జోనల్ మలేరియ అధికారి లక్ష్మానాయక్ (కడప) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ల్యాబ్‌లు, రక్తనమూనాలను పరిశీలించారు.

సీఎం పదవి కోసమే తప్పుడు హామీలు

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ముందే తెలీదా?
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వలేము అనడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు పథకాల అమలుపై దాట వేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందన్న విషయం చంద్రబాబుకు ముందే తెలీదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ముఖ్యమంత్రి పదవి కోసమే చంద్రబాబు తప్పుడు హామీలు ఇచ్చారు అన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఒక్క సిలిండర్‌తో సరిపెట్టిందన్నారు. తల్లికి వందనం ఇస్తామని తల్లులను, 50 ఏళ్లకే బీసీలకు ఫించన్లు ఇస్తామని బీసీలను మోసం చేశారని మండిపడ్డారు. 500 యూనిట్ల వరకు నేతన్నలకు అందిస్తామన్న ఉచిత విద్యుత్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేవలం ఒకటో తేదీన కూటమి నాయకులు ఫించన్లను మాత్రం పంచుతూ ఆర్భాటాలు చేస్తున్నారు తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు.

ప్రజలతో మమేకం

పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాళ్యంలో కాఫీ విత్ వైస్సార్‌సీపీ కార్యక్రమాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ పనితీరు, అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. సంక్షేమ పథకాలేవీ తమకు అందడం లేదని స్థానికులు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం వస్తుందని ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఎన్నికల సమయం వరకూ ప్రజలు ఓర్పుతో ఉండి ఎన్నికల సమయంలో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నరేంద్రరెడ్డి, మాజీ మండల కన్వీనర్లు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, కొండలరాయుడు, అశ్వర్థరెడ్డి, పురుషోత్తంరెడ్డి, మల్లికార్జునరెడ్డి, బోయ శంకర, ఆంజనేయులు, చంద్రా నాయక్, దుర్గప్ప, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

మండలంలోని చంద్రగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డి పొలం పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. అలాగే మాజీ డీలర్ నాగరాజు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనారాయణరెడ్డి కుమారుడు శాంతకుమార్‌రెడ్డి ఇటీవల గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో బాధితులందరినీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రొద్దం: మండల పరిధిలోని కోగిర శివారు కొండ ప్రాంతలో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామ సమీపాన కొండ ప్రాంతంలో పేకాట జోరుగా సాగుతోందన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో ఇద్దరు పేకాట రాయళ్లు పట్టుబడగా, తొమ్మిది మంది తప్పించుకుని పారిపోయినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ. 30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ రూరల్: మండల పరిధిలో ఈడిగ సామాజిక వర్గానికి కేటాయించిన మద్యం దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు రూ.2 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తును స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

‘భూకబ్జా చేయాల్సిన అవసరం మాకు లేదు’

పెనుకొండ: షిరిడీసాయి గ్లోబల్ ట్రస్టుకు ప్రజా సేవ చేయడమే తెలుసని, భూకబ్జాలు చేయాల్సిన అవసరం లేదని షిరిడీ సాయి గోబల్ ట్రస్టు ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో సంవత్సరాల క్రితం భూములు కొనుగోలు చేసి ఎంతో మందికి పనులు కల్పించి వ్యవసాయ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ ఎవరి భూములు కబ్జా చేయలేదుని, 22 ఏళ్ల తరువాత ఇద్దరు, ముగ్గరు రైతులు షిరిడీసాయి గ్లోబల్ ట్రస్టు రైతుల భూములు కబ్జా చేసిందని ఆరోపించడం సరికాదన్నారు. ట్రస్టుకు సంబంధించిన భూముల వివరాలు రెవెన్యూ అధికారులు అందించామని, ఎవరైనా చూసుకోవచ్చని స్పష్టం చేశారు.

యువతి మృతి బాధాకరం

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె మౌనిక బెంగళూరులో బస్సు కింద పడి మరణించడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న మౌనిక ఉపాధి కోసం వెళ్లి మృత్యుపాలవడం కలచివేస్తోందన్నారు. పేద కుటుంబంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ మీట్

మడకశిర: మున్సిపల్ కౌన్సిల్ మీట్ గురువారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. తప్పకుండా కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతర

పావగడ: తాలూకాలోని జాలోడు గ్రామంలో పెద్దమ్మ జాతరోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు మోశారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, మున్సిపల్ చైర్మన్ రాజేశ్ తదితరులు పెద్దమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

అగళి: మండల కేంద్రంలోని శంకరేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో గురువారం ఉదయం 11.30 గంటలకు మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ, టిప్పర్ సీజ్

పరిగి: మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్న దోపీడీదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మంగళవారం రాత్రి ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్‌తో పాటు జేసీబీ యంత్రాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ టవర్ల ఏర్పాటుపై అభ్యంతరం

సోమందేపల్లి: తమ పొలాల్లో 220 కేవీ లైన్‌కు సంబంధించి విద్యుత్ టవర్ల ఏర్పాటుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో బుధవారం విద్యుత్, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య రైతుల పొలాల్లో మూడు విద్యుత్ టవర్ల ఏర్పాటుకు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు రాధాకృష్ణ, ఆంజినేయులు, అంజయ్య అక్కడికి చేరుకొని పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పరిహారం తమకు అవసరం లేదని, పొలాలు నాశనం అవుతాయని అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు తాము కోర్టును ఆశ్రయిస్తామని చెప్పి రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పనులు యథావిధిగా కొనసాగాయి.

అధికారులు లేని సమావేశాలు ఎందుకు?



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామరావు

అమరాపురం: అధికారులు లేని సమావేశాలు ఎందుకుని ఎంపీపీ ఈరన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈరన్న మాట్లాడుతూ శాఖల వారీగా అధికారులు తమ పరిధిలోని నివేదికను చదివి వినిపించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ సిద్దేశ్వర మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను ఏడు గంటల పాటు సరాఫరా చేస్తున్నామన్నారు. ఈరన మాట్లాడుతూ హేమావతి, కె.శివరం పంచాయతీ పరిధిలోని ఫీడర్‌లో విద్యుత్‌ను వ్యవసాయానికి సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కె.శివరంలో సబ్‌స్టేషన్ ఎందుకు ప్రారంభించలేదో చెప్పాలన్నారు. వ్యవసాయం, ఐసీడీఎస్, ఐకేపీ తదితర శాఖల అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. చాలా శాఖల అధికారులు సమావేశానికి దుమ్మాకొట్టారు. దీంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు లేకపోతే సమావేశాలు ఎందుకంటూ మండిపడ్డారు.

మెడికల్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆవరణలో ప్రధాన మంత్రి జన ఔషధీ కేంద్రం మెడికల్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ లింగన్న పేర్కొన్నారు. పీఎంబీజేకే సూచనల ప్రకారం ఏదైనా ఆర్గనైజేషన్, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, చారిటబుల్ ఆర్గనైజేషన్, డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు ఈ నెల 31వ తేదీలోపు ఆస్పత్రిలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శాస్త్రీయ కళలను ప్రోత్సహించాలి



శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: మన సంస్కృతి, సాంప్రదాయాలను, శాస్త్రీయ కళలను ప్రోత్సహించడంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు అవార్డు గ్రహీత, నాట్యరత్న సంధ్యామూర్తి అన్నారు. బుధవారం స్థానిక మహర్షి వాల్మీకి కల్యాణ మండపంలో పట్టణంలోని శ్రీసాయి నృత్య కళా నిలయం 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంధ్యామూర్తి మాట్లాడుతూ భారతదేశం విభిన్న సంస్కృతి, సాంప్రదాయలకు నిలయంగా ఉందన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మరుగున పడుతున్న పల్లె సంస్కృతిని కాపాడుకోవడానికి జానపద కళలను సైతం ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళా నిలయం నిర్వాహకులు వారిజానాథ్, హోమియోపతి వైద్యులు నారాయణరావు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని మునిమడుగుకు చెందిన వెంకటలక్ష్మి బుధవారం తలకు వాడే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంకటలక్ష్మిపై ఇటీవల దాడి జరిగిందని, దాన్ని అవమానంగా భావించే విషద్రవం తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై ‘సాక్షి’ ఎస్ఐ రాజేష్ వివరణ కోరగా వెంకటలక్ష్మి చికిత్స పొందుతున్నారని, ఇప్పటి వరకూ ఎలాంటి వాంగ్మూలం నమోదు చేయలేదన్నారు.

కేబుల్ చోరీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసుముద్రం గ్రామ సమీపంలో వ్యవసాయ బోర్లకు అమర్చిన వైర్లు, స్టార్టర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు రైతులు ఉపేంద్ర, శివన్న తెలిపారు. మూడు వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్, స్టార్టరు దొంగిలించారన్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలకు నీటి తడి పెట్టలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికిపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.